అధికార పార్టీలో ఉన్నా తిప్పలే..

- మండల సభలో సమస్యలు లేవనెత్తిన ప్రజాప్రతినిధులు
- ఉపాధి హామీ పనుల బిల్లులు రావడం లేదని మండిపాటు
- జీపీ సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని స్థితిలో ఉన్నామని ఆవేదన
- డివిజన్‌స్థాయి ఆఫీసర్లు పాల్గొనాలి, సర్వసభ్య సమావేశంలో పూర్తి వివరాలు అందజేయాలని అధికారులకు ఎంపీడీవో ఆదేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ముద్దసాని సులోచన

మానకొండూర్‌: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ ముద్దసాని సులోచన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపిస్తుండగా.. గ్రామంలో అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, ఈజీఎస్ లో చేసిన పనులకు బిల్లులు రావడం లేదని, కనీసం గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు అందజేయలేని పరిస్థితిలో ఉన్నామని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నల్ల వంశీధర్‌రెడ్డి సర్పంచ్ బోళ్ల మురళీ ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీలో ఉన్నా తిప్పలు తప్పడం లేదన్నారు. ఈజీఎస్ అధికారులను అడిగితే మస్టర్ ఎంట్రీలో ఇబ్బందులు ఉన్నాయని బిల్లులు కావడం లేదని చెబుతున్నారని తెలిపారు. కుక్కలు, కోతులతో ఇబ్బందులు పడుతున్నామని, మానకొండూర్-అన్నారం రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉందని గ్రామస్తులతో చివాట్లు పడుతున్నామని, మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో అవస్థలు పడుతున్నామని అన్నారం సర్పంచ్ బొట్ల కిషన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారి సానగొండ రాజశేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్, మిషన్ భగీరథ అధికారులు త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఊటూరు నుంచి పచ్చునూర్ వరకూ తారు రోడ్డు ఇసుక లారీల కారణంగా దెబ్బతిందని, కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, ఊటూరు సర్పంచ్ ఎలగందుల సుదర్శన్ ప్రస్తావించారు. ఆర్‌అండ్‌బీ అధికారి రాజశేఖర్ మానకొండూర్ నుంచి వేగురుపల్లి వరకూ, ఊటూరు నుంచి మానకొండూర్ రహదారి పనులు బాగుచేస్తామన్నారు. పోచంపల్లి శివారులో డీబీఎం 6 కాలువ జమ్మికుంట-మానకొండూర్ తారురోడ్డు మధ్యలో ఉందని, ఇక్కడ కల్వర్టు నిర్మాణం ఆర్‌అండ్‌బీ, ఎస్సారెస్పీ అధికారులు ఎవరూ నిర్మిస్తారో చెప్పాలని ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, డిమాండ్ చేశారు. కల్వర్టు పూర్తిగా కుంగి ప్రమాదకరంగా ఉందని అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు.

నివేదికలు సరిగా ఇవ్వాలి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి కచ్చితంగా డివిజన్ స్థాయి అధికారులు రావాలని చట్టంలో ఉందని, వచ్చే సమావేశంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొనేలా చూడాలని ఆయా శాఖల అధికారులను ఎంపీడీవో దివ్యదర్శన్ రావు ఆదేశించారు. అలాగే ప్రతి సమావేశానికి ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రగతి నివేదికలు సరిగా ఇవ్వడం లేదని, పూర్తి వివరాలతో షార్ట్‌గా కాకుండా ఇవ్వాలని సూచించారు.

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాప్రతినిధులు గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో చేపట్టాలని ఎంపీపీ ముద్దసాని సులోచన కోరారు. చేపట్టిన పనులకు బిల్లులు సకాలంలో వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

జీపీలకు నిధులు వస్తలేవు

- తుప్పు పట్టిన మోటార్లు అమ్మి కరెంట్ బిల్లులు కట్టాం, కార్మికులకు జీతాలు ఇచ్చాం
- సర్వసభ్య సమావేశంలో కిష్టంపేట సర్పంచ్ ఆవేదన
- ఇంకుడుగుంతల బిల్లుల జాప్యంపై సర్పంచుల ఆగ్రహం


మాట్లాడుతున్న ఎంపీపీ ముసిపట్ల రేణుక


సభలో నిలదీస్తున్న సర్పంచ్ ముత్తయ్య

వీణవంక: గ్రామ పంచాయతీలకు ఆరునెలల నుంచి నిధులు రావడంలేదు..గత్యంతరం లేక తుప్పు పట్టిన మోటార్లు అమ్మితే వచ్చిన డబ్బులతో జీపీ కరెంట్ బిల్లులు, కార్మికులకు జీతాలు ఇచ్చాం. బ్యాంకులో రూ.ఎనిమిది లక్షల అప్పు తీసుకొచ్చి పాలన సాగిస్తున్నాం. ఇట్లయితే గ్రామం ఎలా అభివృద్ధి చేయాలని మండలంలోని కిష్టంపేట సర్పంచ్ బండారు ముత్తయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ ముసిపట్ల రేణుక అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కిష్టంపేట సర్పంచ్ బిల్లులు చెల్లించకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్నామని సభ దృష్టికి తీసుకువచ్చారు. రైతులకు సంబంధించిన సమాచారం లేకుండా ఏఈవో అచ్యుత్ సమావేశానికి రావడంపై సభ్యులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస సమాచారం తెలియకుండా వ్యవహరించడంపై మండిపడ్డారు. గ్రామాలలో క్రీడా ప్రాంగణాలు ఉపయోగంలోకి రావడంలేదని వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత అధికారుల ముందుకు తీసుకొచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగే కార్యాక్రమాలపై సమాచారం ఇవ్వడంలేదని పిల్లలకు వచ్చే కోడిగుడ్లు, పాల ప్యాకెట్లు మాయమవుతున్నాయని సర్పంచులు సభ ప్రస్తావించారు. అంగన్‌వాడీ టీచర్లపై విచారణ జరిపాలని కోరారు. గతంలోని ఇంకుడు గుంతల బిల్లులు ఇంతవరకు రాలేదని దీంతో లబ్ధిదారుల నుంచి ఇబ్బందులు పడుతున్నామని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ రాజయ్య, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ప్రారంభం


మాట్లాడుతున్న విజయేందర్‌రెడ్డి

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలో సోమవారం వికాస్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని సర్పంచ్ కంకణాల విజయేందర్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యులు కావాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ రమణ, ఇన్‌చార్జి హెచ్‌ఎం రమేశ్‌రెడ్డి, కోఆర్డినేటర్ స్వప్న, వార్డు సభ్యుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు


యాలాల మల్లన్నస్వామి పెద్దపట్నం


తిమ్మాపూర్: ఎమ్మెల్యే రసమయి పూజలు


చొప్పదండి: విరాళం అందిస్తున్న దాతలు

మానకొండూర్‌: మండలంలోని వేగురుపల్లిలో భూలక్ష్మి,మహాలక్ష్మి, బొడ్రాయి ప్రతిష్ఠాపనమహోత్సవాలు అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. మహిళలు గ్రామదేవతల విగ్రహాలకు జలాభిషేకం చేశారు. వేడుకలు శుక్రవారంతో ముగియనున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఎంపీపీ ముద్దసాని సులోచన-శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కనుకుంట్ల సంగీత-అభిలాష్ , ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా యాలాల మల్లన్న జాతర

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ గ్రామంలో సోమవారం యాలాల మల్లన్న జాతర ఘనంగా నిర్వహించారు. యాదవులు మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు, ఆలయం ఎదుట ఒగ్గు కళాకారులు పెద్దపట్నం వేసి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అగ్నిగుండంలో నడిచి మొక్కులు చెల్లించారు. కొండాపూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాలవారు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. యాదవ సంఘం అధ్యక్షుడు భైరి సంపత్, ఉపాధ్యక్షుడు చీకుట్ల రాజు, వార్డు సభ్యులు సబ్బని సంపత్, కొమురయ్య, శ్రీనివాస్, ఓదయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ. 51 వేల విరాళం

చొప్పదండి: పట్టణంలో నిర్మించిన సాయిబాబా ఆలయ అభివృద్ధికి కరీంనగర్ రూరల్ మండలం ఎలబోతారం గ్రామానికి చెందిన చల్ల చంద్రారెడ్డి, కవిత దంపతులు సోమవారం రూ. 51,116 ఆలయ చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డికి ఆలయ ఆవరణలో విరాళంగా అందించారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. దండె లింగయ్య, దూస రాము, దూస లక్ష్మీనర్సయ్య, కటికం మహేశ్, ఎలిగేటి సుధాకర్, మామిడాల వెంకటాద్రి, వడ్లాల శ్రీనివాస్, సింగిరెడ్డి సుధాకర్ రెడ్డి, గుర్రం మల్లారెడ్డి, చంద్రారెడ్డి, సిరిపురం గంగారాం, దండె వెంకటేశం, నలుమాచు శ్రీధర్, ఈగం కాశీనాథంలున్నారు.

శ్రీ మానసాదేవి ఆలయానికి..

గన్నేరువరం: మండలంలోని శ్రీ మానసాదేవి ఆలయంలో అన్నదాన సత్రానికి గ్యాస్ సిలిండర్ల కొనుగోలుకు సంబంధించి రూ. 6,600 గ్రామానికి చెందిన కల్లెపల్లి దుర్గయ్య సోమవారం ఆలయ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మామిడాల నాగసాయిశర్మ, కోశాధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా వేదపండితులు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్థానికులు పొలం మల్లేశం, వేల్పుల గోపి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, సర్పంచ్ మీసాల అంజయ్య, ఎంపీటీసీ కిన్నెర సుజాత సారయ్య, గుజ్జుల రవీందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు దావు సంపత్ రెడ్డి, సంఘం అధ్యక్షుడు ఆవుల ఓదెలు,ఆలయ చైర్మన్ పొలం అంజయ్య, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు, ప్రముఖులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కార్యక్రమానికి హెచ్‌ఎం రాజమౌళి అధ్యక్షత వహించగా ఎంపీటీసీ మల్లేశం, ఉపసర్పంచ్ శారదసదానందం, సత్యసాయి సేవసమితి జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ లక్ష్మిపతి, కేరీర్‌గైడెన్స్ విభాగం అధ్యక్షుడు మహేశ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ సమ్మయ్య, విద్యాకమిటీ చైర్మన్ జి రమేశ్, హాజరయ్యారు.

నల్లబ్యాడ్జీలతో జీపీ కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న కార్మికులు

చిగురుమామిడి: నాలుగు నెలలుగా వేతనాలు రావడంలేదని మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కారోబార్, సిబ్బంది యూనియన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సోమవారం ఇందుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రభుత్వ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వేతనాలు రాకపోవడం వల్ల నిత్యవసరాలకు ఇబ్బందులు పడుతున్నామని రాష్ట్ర పంచాయతీ కారోబార్ సిబ్బంది యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి గణేశ్ ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం సకాలంలో జీతాలు చెల్లించక కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలంలో పంచాయతీ కార్మికుడు కొంగరి బాబు జీపీ కార్యాలయంలోనే ఉరేసుకున్నాడని, ఇంకెంత మంది ప్రాణాలు పోతే సకాలంలో జీతాలు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసన ఇందుర్తి కారోబార్ శంకరాచారి, సిబ్బంది బుర్కి లక్ష్మణ్, చింతపూల లక్ష్మణ్, సంపత్, రాయమల్లు, వీరయ్య పలువురు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి


శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలకిషన్

మానకొండూర్‌: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కోరారు. సోమవారం మండలంలోని ముంజంపల్లి గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావుతో కలిసి సందర్శించారు. అనంతరం కల్యాలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చెంజర్ల గ్రామానికి చెందిన సుదగోని శ్రీనివాస్‌గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. సర్పంచ్ గోపాల్ రెడ్డి, శేఖర్ గౌడ్, మల్లేశం, కైరి రజిత పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

శంకరపట్నం: మండలంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కొత్తగట్టు, లింగాపూర్, మెట్‌పల్లి, ఆముదాలపల్లె, రాజాపూర్, కన్నాపూర్, అర్కండ్ల, ఏరడపల్లి గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కృష్ణారెడ్డి

జమ్మికుంట: క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుజూరాబాద్ నియోజకవర్గంలో ఖేలో కరీంనగర్, జీతో కరీంనగర్ కార్యక్రమంలో భాగంగా జమ్మికుంటలో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. యువతలో క్రీడా ప్రతిభను ఆవిష్కరించేందుకు ప్రధాని మోదీ సూచన మేరకు దేశ వ్యాప్తంగా ప్రతి పార్లమెంట్ పరిధిలో క్రీడా మహోత్సవాలు నిర్వహిస్తున్నామని, క్రికెట్, కబడ్డీ, కోకో, వాలీబాల్, తదితర ఆటలు ఈ నెల 20 వరకు కొనసాగుతాయన్నారు. క్రీడా పోటీల కన్వీనర్ వాసుదేవరెడ్డి, జిల్లా ఉపాధ్యాక్షుడు సంపత్‌రావు, నియోజకవర్గ కన్వీనర్ గౌతంరెడ్డి, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా మోర్చా ప్రధాన కార్యదర్శి రాజేందర్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, సత్యనారయణరెడ్డి, ఎండీ షఫీ, రాజు, తిరుపతి శ్రీనివాస్, శివశంకర్, శ్రీనివాస్, రవి, రాజుకుమార్, కొండల్‌రెడ్డి, బీజేవైఎం నాయకులు సాగర్,శ్రీకాంత్, నవీన్, సురేందర్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు చిత్తశుద్ధి లేదని కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పలు సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన నిరసనలో పాల్గొని మాట్లాడారు. రెండు సార్లు అధికారంలో ఉండి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల నిర్మాణం, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఇప్పటికైనా కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు జన్నపురెడ్డి సురెందర్‌రెడ్డి కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు సంతోష్, మల్లేష్, విజయ, సర్పంచ్ వెంకటరెడ్డి,అందె మహెందర్, కొండా మల్లయ్య, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన


మాట్లాడుతున్న అధికారులు

గంగాధర: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీటీం, పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్‌చార్జి తాటికొండ విజయమని, గంగాధర ఎస్సై రాజు మాట్లాడుతూ... సోషల్ మీడియాలో నేరాలు వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత విషయాలు, పాస్‌వర్డ్, ఓటీపీ అకౌంట్ వివరాలు ఇతరలకు చెప్పొద్దని, ఫొటోలు, వీడియోలు షేర్ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రంకెన్‌డ్రైవ్, త్రిబుల్ రైడ్, ర్యాష్ డ్రైవింగ్ చేయొద్దని హెల్మెట్ ధరించాలని, నంబర్ ట్యాంపరింగ్, రాంగ్ రూట్, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచు గంగాధర్, హెడ్ మాస్టర్ తిరుపతిరావు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

తైక్వాండోలో గోల్డ్ మెడల్

వీణవంక: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తైక్వాండోలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం చొప్పదండి మండలంలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో చాపింయన్ షిప్ పోటీల్లో జూనియర్స్ విభాగాలలో బబ్బూరి అక్షిత, తిరుమలేశ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. సోమవారం హెచ్‌ఎం పులి అశోక్‌రెడ్డి క్రీడాకారులను అభినందించారు. విద్యార్థులు క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలని సూచించారు.

సహకార సంఘం అధ్యక్షుడిగా రాయుడు

రామడుగు: రామడుగు ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడిగా కడారి రాయుడును సంఘం సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి రాజు ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శిగా గుమ్మల కిష్టయ్య, డైరెక్టర్లుగా కడారి గంగయ్య, ఈరెల్ల అంజయ్య, కడారి రాజు, కడారి పద్మ, కడారి సుమలతను సభ్యులు ఎన్నుకున్నారు.

కోరం లేక మండల సభ వాయిదా

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేశామని ఎంపీపీ రాణి సురేందర్ రెడ్డి తెలిపారు. సమావేశం నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థి ఎంపిక

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రేబెల్లి రవి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్‌ఎంఎంఎస్) ఎంపికయ్యాడు. ఈసందర్భంగా హెచ్‌ఎం కాసం కాత్యాయని మాట్లాడుతూ... గతేడాది కోరపల్లి పాఠశాలకు చెందిన పుల్లూ అజయ్ ఎంపికయ్యాడని, వీరిద్దరిని ఆదర్శంగా తీసుకొని ఈసంవత్సరం ఏడో తరగతి విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ కోసం సిద్ధం కావాలని సూచించారు. అనంతరం రవిని, ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు.

వివేకానంద యూత్ క్లబ్ ఎన్నిక

చొప్పదండి: పట్టణంలోని వివేకానంద యూత్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా దండె శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా గొల్లపల్లి శ్రవణ్‌కుమార్, కస్తూరి వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా అలుస లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా పబ్బతి రవి, కోశాధికారిగా మంచాల మోహన్, ముఖ్య సలహాదారులుగా తాటిపెల్లి అంజయ్య, తెలుకుంట సత్యనారాయణ, గోవులకొండ ప్రదీప్, క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా దూస రాము, సిరిపురం తిరుపతి, గుండ్ల శంకర్, గోవులకొండ అంజనేయులు నియామకమయ్యారు.

నవతరం యూత్ వెల్ఫేర్ ఎన్నిక

చొప్పదండి: పట్టణంలోని నవతరం యూత్ వెల్ఫేర్ అసోషియేషన్ నూతన అధ్యక్షుడిగా జాగిరి సాయి గణేశ్, గౌరవ అధ్యక్షుడిగా అమిరిశెట్టి రత్నాకర్, ఉపాధ్యక్షుడిగా బొడిగె శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా చల్ల అనూష్, సంయుక్త కార్యదర్శిగా పెద్ది సంపత్, కోశాధికారిగా అనుకారి సాయిక్రిష్ణ, కార్యవర్గ సభ్యులుగా తాదూరి శివక్రిష్ణ, పిట్టల చాణుక్య, కోటేశ్, రాచకొండ శ్రీనివాస్, గూడెల్లి లక్ష్మీపతి, ఎముండ్ల రాజు, రాకేశ్, శ్రావణ్, గంగు సంపత్ ఎన్నికయ్యారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి

జమ్మికుంట: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ఇంటి ఎదుట బీజేపీ నాయకులు ఆందోళన చేయడం రాజకీయ లబ్ధికోసమేనని దళిత నాయకుడు మంద రాజేశ్ ఆరోపించారు. సోమవారం పట్టణంలో మాట్లాడారు. పక్క జిల్లాలో నివాసం, రేషన్ కార్డు లేనివారు, సమగ్ర సర్వేలో పేర్లు నమోదుకానివారు, కొత్తగా పెళ్లి చేసుకున్నవారిని రెచ్చగొట్టే పనులు మానుకోవాలని హెచ్చరించారు.

నిధులు మంజూరు

సైదాపూర్: వెన్కెపల్లి తుమ్మల చెరువు కట్టు కాలువ మరమ్మతుకు రూ.19.80 లక్షలు మంజూరయ్యాయని, ఈ నెల 16న టెండర్లు నిర్వహిస్తామని వెన్కెపల్లి సింగిల్ విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల ధ్యక్షుడు సోమారపు రాజయ్యతో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు నియోజకవర్గంపై సంపూర్ణ అవగాహన, అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉందన్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయండి

మానకొండూర్‌: ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ముకుంద రెడ్డి అన్నారు. సోమవారం మానకొండూరులో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ముకుంద రెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 39 చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడులు తీసుకువచ్చిందన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.170 కూలీ ఇవ్వాలని నిర్ణయం చేసిందని ఆరోపించారు. లక్షలాది మందితో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరీంనగర్ జిల్లాలోని కార్మిక వర్గాలకు పిలుపునిచ్చారు.

రామడుగులో దళిత సంఘాల నిరసన

రామడుగు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నాయకులు సోమవారం నిరసన తెలిపారు. నాగి శేఖర్‌ను కాంగ్రెస్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అవమానపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాదయాత్రకు స్వాగతం పలికడానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపివేయడం సరికాదన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై నేడు సమీక్ష

ఇల్లందకుంట: అపరభద్రాద్రిగా పేరొందిన శ్రీ సీతారామచంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 28 నుంచి ఏప్రిల్ 9 వరకు జరగనున్నాయని, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై నేడు దేవస్థాన ప్రాంగణంలో హుజూరాబాద్ ఆర్డీఓ హరిసింగ్ ఆధ్వర్యంలో సమీక్షా నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి కందుల సుధాకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు సకాలంలో పాల్గొనాలని కోరారు.

కవయిత్రి మొల్లమాంబ జయంతి

హుజూరాబాద్: కవయిత్రి మొల్లమాంబ జయంతిని సోమవారం కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని జమ్మికుంట రోడ్డులోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్,మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్,వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల శ్రీనివాస్,కుమ్మరి సంఘం పట్టణ అధ్యక్షులు మోతె రవి,నియోజకవర్గం కార్యదర్శి ఇజ్జిగిరి కుమార్,కమలాపూర్ మండల అధ్యక్షుడు సముద్రాల సదయ్య, పట్టణ కోశాధికారి,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారికంగా నిర్వహించాలి

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. హుజూరాబాద్ నియోజకవర్గ కుమ్మరి సంఘం అధ్యక్షుడు చెల్పూరి కొమురయ్య, ప్రధాన కార్యదర్శి బామండ్లపల్లి రవీందర్ మాట్లాడుతూ మొల్లమాంబ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కుమ్మరులకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలని, వృత్తి పనిముట్లు సబ్సిడీపై అందించాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు తాటిగంటి భూమయ్య, కుమ్మరి కుల బాంధవులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



చిగురుమామిడి: మండలంలోని చిన్న ముల్కనూర్ ఆదర్శ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సమక్షంలో సోమవారం పరీక్ష సామగ్రిని ఎస్సై దాస సుధాకర్ పంపిణీ చేశారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డికి అందించారు. వివాహ వార్షికోత్సవం సందర్భంగా పంపిణీ చేస్తున్నామని ఎస్సై చెప్పారు. అత్యవసరంగా రక్తం ఉందనే సమాచారంతో పెళ్లిరోజు కూడా కరీంనగర్‌కు వెళ్లి రక్తదానం చేశారు. ఇప్పటివరకు ఇరవైసార్లు రక్తదానం చేశానని తెలిపారు. ఎస్సై సేవలను సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు కొనియాడారు.